स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future


# ఎవరండీ మహానుభావులు, కౌట్లో..!

డా. గోపరాజు నారాయణరావు



క్రుత్యాద్యవస్థ మీద అంగీకరించారు డిజిపి దొరవారు. తమ విన్నపాలని దయతో ఆమోదించిన దొరవారి హృదయ వైశాల్యానికి కింది సిబ్బంది యావత్తు పులకించిపోయింది. అంతకంటే లోపలేసిన ఆ శాల్తీని బయటకి తీసుకొచ్చే పని పెట్టనందుకు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది అనొచ్చు.

సెల్‌లో శాల్తీని చూడాలని తహ తహగా ఉన్నా కించిత్ ఫియర్ కూడా ఉంది, డిజిపిగారికి. క్షణకాలం బాగా యోచించి దొరవారు సోఫాలో నుంచి లేచి నిలబడ్డారు, సెల్ దగ్గరికని. ఆ సీనియర్ పోలీసు బుర్రకి చటుక్కున ఏదో తట్టింది. ఠకీమని కూర్చుంటూ అడిగారు,'' ఆ చీపురుకట్ట.....?''




పోలీసులంతా ఏకకాలంలో శిరస్సులు వంచేసుకున్నారు. యూనిఫామ్‌లతో పాటు అటెన్షన్‌లో కూడా ఉన్నారేమో, ఆ పోలీసులందరినీ అలా చూస్తే ఎవరికో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతున్నాయేమోననుకుంటారు. దానికి తోడు మౌనం కూడా చోటు చేసుకుంది. డిజిపి దొరవారిని అలా ఉత్కంఠలో ముంచి చంపెయ్యడం ఇష్టంలేక చివరికి ఒక్క డిఎస్‌పి మాత్రం గళం విప్పాడు, '' ఆ చీపురుకట్టని స్వాధీనం చేసుకోవడం సిబిఐకి, ఐఎస్‌ఐకి కూడా సాధ్యం కాకపోవచ్చు సార్! దాన్ని లాక్కునే సాహసం చేస్తే తమరు ఏదో మెడల్‌కి మమ్మల్ని గాట్టిగా రికమెండ్ చేస్తారు కాని, దగ్గరికెళితే ఎక్కడ చీపురుచార్జి చేసేస్తుందేమోనని చచ్చేంత భయంగా ఉంది. దెబ్బలు తిన్నవాళ్ళ అనుభవం అలాంటిది సార్. అది చీపురుకట్ట దెబ్బ కాదు, వాటమైన రోకటి పోటు. ఇంకా చెప్పాలంటే పది లాఠీ దెబ్బల పెట్టు''.

''అంటే....'' ఇంకా సందేహం తీర్లేదు డిజిపి దొరవారికి. కాని, దానిని కప్పిపుచ్చుతూ, కింది సిబ్బంది పనికిమాలినతనం ధ్వనించేలా అన్నారు.

''వల్లెవాటులోనే ఉంది సార్. అది చీపురో, ఆమె శరీరంలో అంతర్భాగమో అర్థం కానంతగా ఇమిడిపోయింది''. మరో డిఎస్‌పి వివరించాడు.

లొంగిపోయిన నక్సలైట్లని, దొరికిన స్మగ్లర్లని, పట్టుబడిన అంతర్రాష్ట్ర ముఠాల సభ్యులని విలేకరులకి ప్రదర్శించినట్టు ప్రదర్శించదగ్గ కేసు. టివి చానెల్ కెమేరాల వెలుగుల్లోను, ప్రింట్ మీడియా వాళ్ళ కెమేరా ఫ్లాష్‌ల మధ్య, విలేకరుల ప్రశ్నల మధ్య నిందితురాలిని ఎలా వ్యూహం పన్ని పట్టుకున్నదీ వివరించాల్సింది. ప్రస్తుతానికి ఆ అవకాశం లేదు. అసలు ఈ నిందితురాలి అరెస్టు సంగతి సాక్షాత్తు హోంమంత్రి గారికి కూడా తెలియకుండా ఇంతదాకా మేనేజ్ చేసుకొచ్చారు పోలీసులు. తెలిస్తే ఇంకేం లేదు. క్షణంలో లాకప్‌డెత్ జరిగిపోవాలి అని ఆయన ఆదేశించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏ రాజకీయ నాయకుడికి తెలిసినా అంతే. 'ముందు లేపెయ్యండి. తరవాత సంగతి తరవాత' అని కరాఖండీగా చెప్పేస్తారు, అంత గుండె మంట ఆమె అంటే.







కడపకు పశ్చిమాన, కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలో ఆధ్యాత్మిక చింతన అణువణువునా ఉట్టిపడుతూ, దివ్యకాంతులీనుతూ, అమ్మను దర్శించుకునేందుకు ఆహ్వానిస్తూ... ఒక సుందర ద్వార తోరణం కనిపిస్తుంది. ఆ ఆహ్వానానికి స్పందించి, లోనికి అడుగు పెడితే ఎదురుగా దివ్య తేజస్సుతో వెలుగుతున్న సర్వ శోభిత ఆలయం. ఆర్తులకు, 'అమ్మ' అని దరిజేరిన వారికి అభయమిచ్చి ఆదుకునే అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, అనంత శక్తిమయి, 'శ్రీ విజయదుర్గా దేవి' దివ్య సుందర తేజో మూర్తి, అభయమిస్తూ, ఆలంబనగా నిలిచిన ఆది పరాశక్తి, కడప జిల్లాకే కాదు, రాయలసీమలోనే కాదు, అనతి కాలంలో ఆంధ్ర రాష్ట్రంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఆలయం. 'శ్రీ విజయదుర్గా దేవి" నిలయం. ప్రముఖ వాస్తు విద్యా ప్రవీణ 'శ్రీమతి బి. లక్ష్మీ కాంతమ్మ' దుర్గమ్మ మహిమతో స్థలం ఖరారు చేయగా, 2002వ సంవత్సరం మార్చి ఒకటవ తేదీన ఉదయం 10 గంటలకు అమ్మ భక్తులు శ్రీ సుధా మల్లికార్జున రావు, ప్రముఖ వేద పండితులు, శ్రీమాన్ వెల్లాల వెంకట శేషయ్య పర్యవేక్షణలో 'అమ్మవారి ప్రతిష్ఠ' నిర్వహించారు. నాటి నుండి నేటి వరకు అటు సామాన్య భక్తుల నుండి ఇటు ప్రముఖ ఆధ్యాత్మిక గురువులూ, పీఠాధిపతుల నీరాజనాలు, జేజేలు అందుకుంటున్న శ్రీ విజయ దుర్గమ్మ కరువు జిల్లా కడపకు అభయ హస్తమై నిలిచి, కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతుల వారు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వాములు, శ్రీ గణపతి సచ్చిదానంద స్వాములు, విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర స్వాములు అమ్మను దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అమ్మ కృప పొందిన భక్తుల నోటి ప్రచారమే నేడు రాష్ట్రంలోనే విశిష్ఠ ఆలయంగా మార్చింది.

ఏటా మార్చి 17 నుండి 23వ తేదీలలో శ్రీ సూర్య భగవానులు తన అరుణ కిరణాలతో అమ్మవారి పాదాలను స్పృశిస్తారు. సెప్టెంబర్ 18 నుండి 23 వరకు మరోసారి ఇదే వింత మరోసారి జరుగుతుంది. దైవం మానవ లోకానికి వచ్చేందుకు ఓ కారణాన్ని సృష్టించుకుంటారు. శ్రీ విజయ దుర్గమ్మ తన భక్తుడు సుధా మల్లికార్జున రావును కారణ జన్ముడిని చేసింది. అతి సామాన్య స్థాయి నుండి అమ్మ కరుణా కటాక్షాలతో 'ఇంతింతై - వటుడింతై" అన్నట్లు ఆ వ్యక్తి అమ్మకు అత్యంత సుందర ఆలయాన్ని నిర్మించేందుకు శక్తినిచ్చింది. అణువణువునా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొలువు దీరింది. భక్తులకు కొంగు బంగారమై నిలిచింది. పిలిస్తే పలికే మహిమాన్విత శక్తిగా విలసిల్లుతోంది.



శ్రీ విజయదుర్గాదేవి ఆలయం, చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి ఎన్.హెచ్-18 బిల్టప్ దగ్గర, కడప - 516 001. ఫోన్ : 241652.



సుధా మల్లికార్జున రావు
ఆలయ వ్యవస్థాపకులు

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
गौरवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

సెల్‌లో గోడవైపు తిరిగి పడుకుని ఉంది నిందితురాలు.

చూసి నిర్ఘాంతపోయారు డిజిపి వారు.

తెల్లటి పైను పంచె కట్టుకున్న పూర్వకాలపు బామ్మ ఆమె. బూట్ల అలికిడికి చటుక్కున లేచింది. మందుపాతర అనుమానం తగిలినట్టు పోలీసు పటాలం తక్కున ఆగిపోయింది.

ఆమె కుడి చేతితో సజీవ సాలగ్రామం లాంటి గుండు మీద నుంచి జారిపోతున్న పంచెను పైకి తీసుకుంది. తరువాత వల్లెవాటులో రహస్యంగా ఉన్న ఆయుధాన్ని ఒక్కసారి తనిఖీ చేసుకుని నిర్భయంగా కూర్చుంది నిందితురాలు, గోడవైపే తిరిగి.

'ఇన్ని సంవత్సరాలుగా ఎందరికో పెద్దలకి నిద్రాహారాలు లేకుండా చేసిన మనిషి ఈ బామ్మేనా!' అనుకోకుండా ఉండలేకపోయారు డిజిపి దొరవారు. కనీసం రౌడీరాణిలా ఉంటుందనుకుంటే ఈ ఓల్డ్ టైపు బామ్మ కనిపించింది.

వందమంది దాకా ఖాకీలకి ఖద్దరు వేసి, కోట్లు తొడిగి, భుజాలకి సంచీలు తగిలించి, గెడ్డాలు గొరిగించకుండా సిగరెట్లు తగలేయించడం వంటి రకరకాల విన్యాసాలు చేయిస్తూ కొన్నేళ్ళుగా రాష్ట్రమంతా ఎరేసినట్టు తిప్పితే, ఆఖరికి గతరాత్రి హైదరాబాద్ నగరంలోనే ఓల్డ్ ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌కి కాస్త అవతల వీళ్ళతో చీపురుకట్ట యుద్ధానికి దిగి, అనుకోకుండా పట్టుబడిపోయింది. చీపురుకట్ట సింగారం చేయించుకున్న పోలీసులు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు.

" ఇదిగో! కాస్త ఇటు తిరుగుతావా! డిజిపి దొరవారు వచ్చారు'' అన్నాడొక డిఎస్పి. అంగుళం కూడా కదల్లేదామె.

ఒక నిమిషం తీక్షణంగా చూసి, పోలీసులంటే అస్సలు ఖాతరీ లేదన్న సంగతి నిర్ధారించుకుని మళ్ళీ వచ్చి సోఫాలో చతికిల పడ్డారు డిజిపి.

అప్పటికే అక్కడ పెట్టి ఉన్న టీ తాగుతూ హఠాత్తుగా అన్నారు.

''ఇంటరాగేషన్‌కి వెళ్ళేవాళ్ళకి కవచాలూ అవీ అవసరమవుతాయేమో! అవొచ్చిన తరువాతే సెల్‌లోకి వెళ్ళండి'' అన్నారు డిజిపి.

''ఎస్సార్, ఓకేసార్!'' ఒక్కసారే నాలుగైదు కంఠాలు అన్నాయి దొరవారి ఔదార్యానికి కృతజ్ఞతను ధ్వనింపచేస్తూ.

రాత్రి ఒంటిగంట అవుతుంది. దొరవారు టీ తాగుతున్నారన్న మాటేగాని, బుర్రనిండా ప్రశ్నలే. అది టీ కంటే వేడిగా ఉంది.

మళ్ళీ హఠాత్తుగా అడిగారు, " ఆ ముసలి ఫోటోగ్రాఫర్ మీద దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఈజ్ దేర్ ఎనీ ప్రొగ్రెస్?''

''ముసలాడు తీసిన ఫోటోలన్నీ ప్రింట్లు వేయించాం సార్! పావుగంటలో వస్తాయి!'' ఒక సిఐ ముందుకు వచ్చి వినయంగా చెప్పాడు.

" అబ్బబ్బ! కంటి మీద కునుకు లేకుండా చేశారుకదయ్యా, ఈ ఇద్దరూ! వారం తేడాలో ఎలా దొరికిపోయారో!'' అన్నారు డిజిపి నుదుటి మీద గోరుతో గీరుతూ.

" ఆ ఇద్దరికీ ఏదో లింకు ఉన్నట్టే ఉంది సార్!'' అన్నాడో కొత్త డిఎస్పి.

" వయసులో ఏం ఏడిశారో మనకేం తెలుసు?'' అన్నారు డిజిపి.

" అబ్బే. ఆ టైపు లింకు కాదన్సార్. ఈ కేసులోనే. ఇదేదో ముఠాయేమో కూడా! ఆ కోణం నుంచి కూడా దర్యాప్తు అవసరం సార్!'' అన్నాడతనే.

" ఒక్క కోణం కాదయ్యా. నాకు డజను కోణాలు కనిపిస్తున్నాయి?'' అని డిజిపి వారు అంటూ ఉండగానే కొన్ని ఫైళ్ళు ఆయన ముందు టీపాయ్ మీద పెట్టి, స్ట్రాంగ్‌గా సెల్యూట్ చేసి నిష్క్రమించాడు కానిస్టేబుల్. ముసలమ్మ విచక్షణా రహితంగా చేసిన చీపురు కట్ట చార్జిలో గాయపడిన బాధితులు పెట్టుకున్న కేసుల బాపతు ఫైళ్ళగుట్టలవి.







స్వాతంత్ర్యానికి ముందుకాలం నాటివి కూడా అందులో ఉన్నాయి, ఒకటో రెండో. ఇటీవలి కాలానివే చాలా ఎక్కువ. విజయనగరం నుంచి మొదలయ్యి, అలా రాష్ట్రానికి చెందిన పలు ప్రాంతాల వారు పెట్టిన కేసులు అవన్నీ. టీకప్పు కింది పెట్టి ఫైళ్ళని వేగంగా చూడడం మొదలుపెట్టారు డిజిపి.

ఏ విభాగానికి ఆ విభాగం ఉన్నాయి. నేను ఫలానా రోజున ఫలానా వేదిక మీద ఉపన్యసించు చుండగా అని కొందరు, నేను రిబ్బను కత్తిరిస్తూ ఉండగా అని ఇంకొందరు, మరీ ఎన్నికల ప్రచారంలో ఉండగా అని.... ఒక్కొక్కటీ ఓ రెండు మూడు వందల ఫిర్యాదులు కనిపిస్తున్నాయి. ఆయనెవరో పాపం, లెక్చరు ఇచ్చి క్లాసు నుంచి బయటకు రాగానే ఒక ముసలమ్మ చితక్కుమ్మేసి మాయమైంది అని రాశాడు. అవార్డు వచ్చిన సందర్భంగా హాలులో అభి

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

మానులు సన్మానం చేయగా,బయట చీపురుకట్ట సత్కారం జరిగిందని ఫిర్యాదిచ్చాడింకో ప్రముఖుడు. 'ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం సురభివారి నాటకంలో మాయాస్త్రీ వలె అతి లాఘవంగా ఆమె ప్రత్యక్షమవుతుంది. ఎక్కడ ఎలా గుట్టుగా ఉంచుకుంటుందో ఏమో, కనెప్పపాటులో ఆ ఆయుధాన్ని సర్రున బయటకు లాగుతుంది. అంటే చీపురుకట్టను చేత ధరిస్తుంది. ఎండలో వేసిన పరుపుని బాదినట్టు జబ్బ పుష్టి కొద్దీ బాదేస్తుంది. బాధితుడు ఎంతటివాడయినా స్పృహ కోల్పోవలసిందే. ఒకటీ అరా ప్రాణాపాయం వరకు పోయిన సందర్భాలూ ఉన్నాయి. బాధితుడు కిందపడ్డాక మొహం కేసి నిదానించి చూసి, '' అయ్యో! ఆ వెధవ కాదు. అలాగే అనిపించాడేమిటి చెప్మా!'' అని సణుక్కుంటూ ఎలా వచ్చిందో అలాగే మాయమైపోతూ ఉంటుంది, అంతా తెప్పరిల్లేలోగా', అని రిపోర్టులో రాశాడు ఒక సిఐడి ఆఫీసరు.

''ఫోటోలు వచ్చాయి సార్!'' ఒక ఎస్‌పి వినయంగా పట్టుకుని ఉన్నాడు. చూస్తున్న ఫైలు పడేసి అవి అందుకున్నారు డిజిపి. ఆ వెనకే ఇద్దరు కానిస్టేబుల్స్ ఒక ముసలి శాల్తీని రెండు రెక్కలు పట్టుకుని తీసుకొచ్చారు, ఎక్కడి నుంచో. ఫేడయిపోయిన ఫోటోకి ప్రాణం వచ్చినట్టు ఉన్నాడు.

మళ్ళీ ఆశ్చర్యపోయారు డిజిపివారు. వీళ్ళందరి ఫోటోలు ఈ ముసలాడేం చేసుకుంటాడు? ఎవరికేనా ఇస్తాడేమో! ఇంటరాగేషన్‌లో తేలాలి.

ముసలాయన దగ్గర స్వాధీనం చేసుకున్న పాత కెమేరాని పరీక్షించారు డిజిపి వారు. కచ్చితంగా పందొమ్మిదో శతాబ్దానిది. చిరాగ్గా పక్కన పడేసి ఫోటోలు చూడడం మొదలు పెట్టారు. కొన్ని బ్లాక్ అండ్ వైట్. ఎక్కువ కలర్. వాటిని చూసి అంత పెద్ద పోలీసాయనా మంచం కింద మందుపాతర పేలినట్టు అదిరిపోయాడు.

మొదటి ఫోటోయే షాక్ ఇచ్చింది. రెండో ఫోటో కూడా ఇంకో షాక్. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

''డే ఆఫ్ ది షాక్స్'' గట్టిగా అరిచేశాడు దెబ్బకి డిజిపి.

చిన్న పోలీసులు వణికిపోయారా అరుపుకి. తేరుకొనే లోపల మళ్ళీ అన్నారాయనే.

'' ఇదేదో పెద్ద కుట్ర''

పోలీసు బాసే అంతగా అదిరిపోతున్నపుడు తాము కాస్తయినా అదరకుండా ఉండడం మర్యాద కాదనుకున్నారు కాబోలు కింది పోలీసులు, తమ చేతుల్లో బందీగా ఉన్న ముసలాయన్ని ఆలస్యం చేయకుండా బడబడా ఈడ్చుకెళ్ళి అదే సెల్‌లోకి విసురుగా తోసేశారు పోలీసులు.

* * *

''ఎవరమ్మా తమరు, ఇంత రాత్రి కొట్లో?'' తోటి నిందితురాలిని పలకరించాడు ముసలాయన, చేతులూ కాళ్ళూ నింపాదిగా విదిలించి, నెమ్మదిగా గోడకు అనుకుని కూర్చుంటూ.

''నేనొక వెధవ కోసం గాలిస్తూ ఈ పీనుగుల చేతికి చిక్కానులెండి. తమరెవరో?'' అంది బామ్మ నిందితురాలు.

''నేనూ అదే పనిలో ఉన్నా? తీయించుకున్న ఫోటోకి డబ్బు పారేయ్యెద్దూ. వాడి బాబు సొమ్మా! డబ్బులు తీస్కరారా అని మా బంట్రోతుని పంపా. చుట్టలకి ఆశపడి వదిలేసి వచ్చాడు. ఏనాటికయినా ఆ వెధవని పట్టుకుని వాడు చేసిన వెధవ పని తెలిసేలా న్యూస్‌పేపర్లో వాడి ఫోటో వేయించాలని నా జీవితాశయంగా పెట్టుకున్నా. ఇలాంటి అన్యాయం భవిష్యత్‌లో మరో ఫోటోగ్రాఫర్‌కి జరక్కూడదు కదా! అందుకే ఇలా దేశం మీద పడ్డా. హైదరాబాద్ నిజాము సదరదాలత్ బావు రల్లీ ఖాన్ వాడి దోస్తట. చెప్పేవాడులే. కాబట్టి ఆ స్థాయి సొసైటీలోనే వెతకడం మొదలు పెట్టాను. పెద్ద మనిషి వేషం కదా అని పెద్దమనుషులు ఉండే చోటుకి వెళితే, ప్రతివాడు వాడిలాగే కనపడి చస్తున్నారు. కాని వాడు కాదు. ఫోటో తీసేశాక 'నువ్వు ఫలానా, అబద్ధం ఆడకు' అంటే వాళ్ళంతా నన్నో వెర్రి వెధవని చూసినట్టు చూసేవారు'' అంటూ ఆగారాయన కాస్త విరామం కోసం.

వెంటనే అందుకుంది బామ్మ.

'' నా పంచన చేరాడో వెధవ. సంతలో సామాను కొనిపెడతానని ఇరవై రూపాయలు తీసుకెళ్ళి సాని పాపల ఎదాన కొట్టాడు. వెధవ, డాన్సింగ్ గరల్సు అంటూ ఇంగ్లీషులో పేల్తాడు. ఇంగ్లీషులో అఘోరించినంత మాత్రాన సాన్ది సాన్ది కాకుండా పోతుందా ఏమిటీ! నాకు అర్థం కాదా! ఓ రోజు పొద్దుటే నా ఇరవై రూపాయలు ఇమ్మని కడిగేశాను. నాకూ వాడికీ యుద్ధమై పోయింది. కాళ్ళకి బుద్ధిచెప్పాడు. నేనెందుకు వదుల్తాను. కనిపిస్తే సిగపాయ తీసి తన్ననూ! అందుకే చీపురుకట్ట వేసుకుని అప్పుడు వీధులెంట పడ్డాను. సానిదాని ఇంట్లో






మాయోపాయం చేసి దాన్ని తేవదీసుకుపోయి విహారియేడి
చేసుకుంటేనట్టయినా- కీర్తి సుఖం కూడా దక్కుతాయి. టూ బర్డ్స్ యట్ వన్ షాట్.

దూరాడని చెబితే వెళ్ళా. పాపం అది సానివాళ్ళలో తప్పపుట్టింది. ఉత్తమురాలు. దాన్నికూడా వీడి గోతాలతో బుట్టలో వేశాడు. నా గొంతు విని సిగ్గులే కుండా మంచం కింద దూరాడు. సానిదే సైగ చేసి చూపించింది. చీపురుకట్ట తీసి ఫెడీ ల్మని అంటించాను. ఆ వెధవ తప్పించుకుపోయాడు. ఆ మంచం కిందే దాచింది ఇంకో కణ్ణి. నా చీపురు వెళ్ళి వాణ్ణి కుమ్మేసింది. పాపం, దానికేం తెలుసు చెప్పండి! పెద్ద రచ్చయిపోయింది. అప్పటి నుంచి చీపురుకట్ట కిందపెడితే ఒట్టు. వెతుకుతూనే ఉన్నాను. ఏమిటో! ఎంతమందినో బాదేశాను గాని, అసలు వెధవ కనపడ్డంలా. కొట్టేసిన తర్వాత తెలుస్తోంది. వాళ్ళంతా సంఘంలో పెద్దమనుషుల్ట. ఇంతకీ తమరిది ఏ వూరో సెలవిచ్చారు కాదు!''

''విజయనగరం!'' నెమ్మదిగా చెప్పాడు ముసలాయన.

''మాదీ అదే.'' అంటూ ముసలాయన ముఖాన్ని నిదానించి చూసింది. '' మీరు.....తమరు పొటిగరాప్పంతులు గారు కదండీ, చెప్పేవారు కారేమండీ ఇంతసేపూ! '' అంది బామ్మ.

'' ఔను. నువ్వూ ... ఆఁ ఆఁ గుర్తుపట్టాను..... కానీ, క్షమించాలి. అసలు పేరేమిటో మరి! పూట కూళ్ళమ్మ అనేవారంతా! ఔనా!''




'' ఆఁ. ఆ అభాగ్యురాలినే.''

'' అంటే నీ వెదుకులాట కూడా.......!''

''నా వెదుకులాట కాదు. నా చీపురుకట్టది'' అంది పళ్ళు నూరుతూ.

------

అక్కడ, మంచి రద్దీవేళ బ్యాంకు కాషియర్ రూపాయలు లెక్కిస్తున్నంత వేగంగా ఫోటోలు చూస్తున్నారు డిజిపి దొరవారు.

ఢిల్లీ నుంచి గల్లీ దాకా దశాబ్దాల నుంచి ప్రజా జీవనంతో మమేకమైన ఎందరో నేతలు, మాజీ మంత్రులు, తయారవుతున్న మంత్రులు, వందలాది ఉపన్యాసాలు ఇచ్చిన మేధావులు, వేలాది సన్మానాలు పొందిన కవులు, రచయితలు.... అవార్డులు స్వీకరించిన సాహిత్యవేత్తలు.....హక్కుల ఉద్యమాలు, సెక్యులరిజం పరిరక్షణ జమిలిగా చేస్తున్న మహనీయులు...... ఆర్ట్ సినిమాలు తీసే కళాద్రష్టలు.... సరిగ్గా ఆ ఫైళ్ళకి అవసరమేమో అన్నట్టు ఫిర్యాదీల ఫోటోలే అన్నీను.

ఇక్కడ సెల్‌లో ఒక్క క్షణం మౌనం తరువాత ఆ ఇద్దరి నోటి నుంచీ ఒక్కసారే వచ్చింది, కూడబలుక్కున్నట్టు.

'' అయినా, ఏమిటీ విపరీతం. అప్పుడొక్కడే , ఇప్పుడు ఇంతమంది గిరీశాలేమిటో.......!''




విశ్వసించు-
విజయాన్ని పొందు

తెలుగు/హిందీ/
ఆంగ్లంలో లభించే
ఉచిత పుస్తకానికై
నేడే మాకు వ్రాయండి.

అబండెంట్ లైఫ్ రిసోర్సెస్
పోస్ట్ బ్యాగ్ నెం. 24,
సికింద్రాబాద్ - 500 026.